క్లుప్తంగా

కుష్ఠు వ్యాధితో అంగవైకల్యం

గొట్టిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి మేరియునిస్



ప్రత్తిపాడు: కుష్ఠు వ్యాధితో కాళ్లు, చేతులు వంకర్లు పోయి అంగవైకల్యం బారిన పడే ప్రమాదం ఉందని గొట్టిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మేరియునిస్ అన్నారు. మండల పరిధిలోని నడింపాలెంలో గురువారం కుష్ఠు వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులతో కలిసి శరీరంపై స్పర్శలేని మచ్చలు ఉంటే వైద్యులను సంప్రదించాలని, బ్యాక్టీరియాతోనే కుష్ఠు వ్యాధి.. అంటూ నినాదాలతో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మేరియునిస్ మాట్లాడుతూ ఆగస్టు రెండవ తేదీ వరకు గ్రామాల్లో కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ప్రత్యేక సర్వే జరుగుతుందన్నారు. తెలియకుండానే చేతులు, కాళ్లలో బొబ్బలు రావడం, కాళ్లకు చెప్పులు జారిపోవడం, చల్లని వేడి వస్తువులను గుర్తించలేకపోవడం, అరిచేతులు, అరికాళ్లలో స్పర్శ కోల్పోవడం వంటి లక్షణాలు ఉంటే పరిశీలించి, రోగ నిర్ధారణ అయితే మెరుగైన వైద్యం అందిస్తామన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ నిర్మల, ఎంఎల్‌హెచ్‌పీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలి

సమగ్ర శిక్ష ఏఎంవో జయశంకర్



కాకుమాను: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీల పట్ల ఆసక్తి కనబరిచే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని సమగ్ర శిక్ష ఏఎంవో జయశంకర్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో నిర్వహిస్తున్న శిక్షా సప్తాహ్ కార్యక్రమాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జయశంకర్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని రంగాల్లో అవగాహన కలిగించాలనే లక్ష్యంతో ప్రతి పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి పాఠశాలలో తప్పనిసరిగా వారికి కేటాయించిన షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవోలు కె.ఎఫ్.కెనడీ, విజయ్ భాస్కర్, హెచ్‌ఎంలు బి.సత్యం, శ్రీరామ ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కిరాణా షాపు ఆహుతి



ప్రత్తిపాడు: కిరాణా షాపు అగ్నికి ఆహుతైన ఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. వట్టిచెరుకూరు మండలం లేమల్లెపాడుకు చెందిన మాకినేని శ్రీనివాసరావు గత కొంతకాలంగా కిరాణా దుకాణం నిర్వహిస్తున్నారు. బుధవారం అర్ధరాత్రి సమయంలో షాపు దగ్ధమవ్వడంతో సుమారు ఆరు లక్షల రూపాయల వరకు ఆస్తి నష్టం సంభవించినట్లు శ్రీనివాసరావు చెబుతున్నారు. అయితే దహనం ప్రమాదవశాత్తూ విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో జరిగిందా లేక కావాలనే ఎవరైనా చేశారా అన్నది తెలియాల్సి ఉంది. ఘటనపై దుకాణ యజమాని వట్టిచెరుకూరు పోలీసులను ఆశ్రయించారు. క్లూస్ టీం ఆధారాలను సేకరించింది. బాధితుడు మాత్రం ఎవరో కావాలనే దుకాణాన్ని తగలబెట్టినట్లు ఆరోపిస్తున్నారు.

లయోలా పాఠశాలలో ఎన్‌సీసీ క్యాడెట్‌ల ఎంపిక



గుంటూరు రూరల్: మండలంలోని నల్లపాడు గ్రామంలో గల లయోలా పబ్లిక్ స్కూల్‌లో 25వ ఆంధ్రా బెటాలియన్ ఆధ్వర్యంలో గురువారం ఎన్‌సీసీ క్యాడెట్‌ల ఎంపిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ ఫాదర్ బి.సురేష్‌కుమార్ మాట్లాడుతూ ఎన్‌సీసీ క్రమశిక్షణకు మారు పేరని తెలిపారు. ఎన్‌సీసీ క్యాడెట్‌లు, ప్రతి విద్యార్థి దేశాన్ని ప్రేమించాలన్నారు. పాఠశాల నుంచి 52 మంది విద్యార్థులు ఎన్‌సీసీ క్యాడెట్‌లుగా ఎంపిక వ్వటం సంతోషకరమన్నారు. ఎన్‌సీసీ ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, దేశభక్తి, నాయకత్వ లక్షణాలను పెంపొందించవచ్చన్నారు. కార్యక్రమంలో 25ఏ బెటాలియన్ లెఫ్టినెంట్ కల్నల్ దీపక్‌రాజు, ఎస్‌ఎం సాబ్, ఎన్‌వోలు తదితరులున్నారు.

చదువుకున్న పాఠశాలకు సేవ



మాట్లాడుతున్న 1989-90 బ్యాచ్ పూర్వ విద్యార్థులు



విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

- ముట్లూరు సెయింగ్ గ్జేవియర్స్ పాఠశాలకు 1989-90 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం
- నగదును స్కూల్ హెచ్‌ఎం, చర్చి ఫాదర్‌కు అందజేత

ప్రత్తిపాడు: ఎంతో మంది ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతారు. జీవన గమనంలో ముందుకు సాగుతారు. కానీ కొందరు మాత్రమే విద్యాబుద్ధులు నేర్పిన బడి రుణం కొంతైనా తీర్చుకోవాలని, మన ఊరి పిల్లల బాగు కోసం తమ వంతుగా సాయం చేయాలని కాంక్షిస్తుంటారు. అటువంటి కోవకు చెందిన వారే వట్టిచెరుకూరు మండలం ముట్లూరు సెయింట్ గ్జేవియర్స్ హైస్కూల్‌కు చెందిన 1989-90 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు.

- తాము విద్యాబుద్ధులు నేర్చుకున్న పాఠశాలకు సమీపంలోని కోవెలమూడి, కారంపూడిపాడు గ్రామాల నుంచి విద్యార్థులు వస్తుంటారు. అయితే ఆయా గ్రామాల విద్యార్థులకు సకాలంలో రవాణా సౌకర్యం అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. మరికొందరు రవాణా సౌకర్యం లేక చదువును మధ్యలోనే నిలిపివేసిన సందర్భాలూ ఉన్నాయి. దీంతో ఆయా గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ఏడాది పాటు పాఠశాలకు వచ్చి, వెళ్లేలా ఆటో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.
- అదే విధంగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం సమృద్ధిగా, రుచికరంగా, నాణ్యంగా అందించాలని, నూటికి నూరు శాతం పాఠశాలలోనే మధ్యాహ్న భోజనం చేయాలని తలంచారు. అందుకుగాను ఏడాది పాటు బీపీటీ రైస్‌తో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేసి, పదిహేను రోజులకోసారి చికెన్ అందించాలని నిర్ణయించారు.

రూ.2 లక్షలు అందజేత..

1989–90 బ్యాచ్ విద్యార్థుల అభినందన సభ బుధవారం తాము చదువుకున్న పాఠశాలలో ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో తొలి విడతగా రూ.2 లక్షల ఆర్థిక సాయాన్ని పూర్వ విద్యార్థులు పాఠశాల హెచ్ఎం మేరిజోస్పినా, చర్చి ఫాదర్, పాఠశాల కరస్పాండెంట్ దిలీప్‌కుమార్‌కు అందించారు. తొలివిడతగా రూ.2 లక్షలు అందజేశామని, మరికొంత ఆర్థిక సాయాన్ని అందించేందుకు కృషి చేస్తామని పూర్వ విద్యార్థులు తెలిపారు. అదేవిధంగా పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందిస్తామని చెప్పారు. పాఠశాల అభ్యున్నతికి కృషి చేస్తున్న పూర్వ విద్యార్థులను హెచ్ఎం, ఫాదర్ అభినందించారు. కార్యక్రమంలో ప్రత్తి జయపాల్, దాసం శివ నాగరాజు, గుంటుపల్లి సుందరరావు, మేకల శ్రీనివాసరావు, పొనకల నాగరాజు, చాగంటి చంద్రశేఖర్, తోకల అరుణ, పులికొండ వైదేహి, మొవ్వా శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

చేయూతను అందించాలని..



పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మా వంతుగా ఎంతో కొంత చేయూతను అందించాలని భావించాం. పూర్వ విద్యార్థులమంతా కలసి రవాణా సదుపాయాన్ని ఏర్పాటు చేస్తున్నాం. మెరుగైన మధ్యాహ్న భోజనానికీ మా వంతుగా చేయగలిగింది చేసేందుకు అడుగు ముందుకు వేశాం. పదిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందిస్తాం.

పి.జయపాల్ (పూర్వ విద్యార్థి)
ముట్లూరు, వట్టిచెరుకూరు మండలం

విద్యను ప్రోత్సహించాలని..



విద్యను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలి. పొరుగున ఉన్న గ్రామాల నుంచి పాఠశాలకు వచ్చే బాలబాలికలు పడుతున్న ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని వారికి ఇబ్బంది లేకుండా చేయాలని మా బ్యాచ్ ఈ నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగానే ఈ రోజు కొంత నగదును పాఠశాలకు అందించాం. ఇందుకు మా బ్యాచ్ విద్యార్థులు చూపిన చొరవ, అందించిన చేయూత మరువలేనిది. పిల్లల భవిష్యత్‌కు పునాదులు వేయడంలో ముందుంటాం.

దాసం శివనాగరాజు (పూర్వ విద్యార్థి)
ఏజీఎం, నారాయణ విద్యాసంస్థలు, గుంటూరు జిల్లా

పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత

వాటర్ ఎయిడ్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ సురేష్

ప్రత్తిపాడు: పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యతని వాటర్ ఎయిడ్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ సురేష్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వాటర్ ఎయిడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులకు నీరు, పారిశుద్ధ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సురేష్ నీటి నాణ్యత పరీక్ష విధానాలు, ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ, మరుగుదొడ్ల ఆవశ్యకత, పరిసరాలు, చేతుల పరిశుభ్రత వంటి అంశాలను వివరించారు. ఆయా అంశాలపై పనిచేసే ప్రతి ఒక్కరూ కనీస అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా వాటర్ ఎయిడ్ సంస్థ ప్రతినిధులు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించేలా కిట్లను వారికి అందజేశారు. కార్యక్రమంలో సీడీపీవో సుజాత దేవి, ఏసీడీపీవో విజయనిర్మల, తుమ్మలపాలెం సర్పంచ్ నాగమల్లేశ్వరి, తిక్కిరెడ్డిపాలెం సర్పంచ్ మాకినేని జగన్‌మోహన్‌రావు, వాటర్ ఎయిడ్ సంస్థ ప్రతినిధులు సాయి, సునీల్, సత్యవాణి, వేణు, తుమ్మలపాలెం, ఈదులపాలెం, తిక్కిరెడ్డిపాలెం, నిమ్మగడ్డవారిపాలెం గ్రామాల వార్డు సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.



సంస్థ ప్రతినిధులు అందజేసిన కిట్లతో అంగన్‌వాడీలు, వార్డు సభ్యులు, వీవోఏలు

చెరువులు, బావుల్లో గంబూషియా చేపలు



బావిలో గంబూషియా చేపలను వదులుతున్న ఎంపీహెచ్‌ఈవో చెల్లమ్మ, ఏఎన్‌ఎం అనిత



పెదకాకాని చెరువులో గాంబూషియా చేపలను వదులుతున్న వైద్య సిబ్బంది

ప్రత్తిపాడు: సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉండటంతో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. మండల పరిధిలోని పెదగొట్టిపాడు, గనికపూడి, తుమ్మలపాలెం, యనమదల, నడింపాలెం, ఈదులపాలెం గ్రామాల్లోని రక్షిత మంచినీటి చెరువులు, మంచి నీటి బావుల్లో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మేరి యునిస్ ఆధ్వర్యంలో గంభూషియా చేపలను విడిచి పెట్టారు. ఇవి నీళ్లలో ఉండే నాచును తినడంతో పాటు లార్వా ఉన్నా తినే స్థాయని ఆరోగ్య సిబ్బంది తెలిపారు. తద్వారా ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా కొంతమేర కాపాడవచ్చని ఎంపీహెచ్‌ఈవో చెల్లమ్మ చెప్పారు.

దోమల నివారణకు చర్యలు

పెదకాకాని: దోమల నివారణకు చెరువుల్లో గాంబూషియా చేప పిల్లలను వదలడం జరిగిందని పెదకాకాని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పి.ప్రవీణదీప్తి అన్నారు. పెదకాకాని మండల పరిధిలోని నంబూరు, పెదకాకాని, తక్కెళ్ళపాడు, ఉప్పలపాడు గ్రామాల్లోని చెరువుల్లో గురువారం 4000 చేప పిల్లలను వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రవీణదీప్తి మాట్లాడుతూ డెంగీ, మలేరియా వంటి వ్యాధులను వ్యాపింపజేసే దోమలు వృద్ధి చెందకుండా గాంబూషియా చేపలు వదలడం జరిగిందన్నారు. దోమల నివారణ ద్వారా వ్యాధులను అరికట్టవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సూపర్‌వైజర్ పుసులూరి శ్రీనివాసరావు, ఎంపీడీవో బి.వి.మల్లేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.





• ప్రమాదంతో ఆటలు

అభం శుభం తెలియని చిన్నారులు తెలిసీ తెలియక ప్రమాదంతో ఆటలాడుతున్నారు. పాఠశాల ముగిసిన తరువాత ఉపాధ్యాయులను ఇళ్లకు వెళ్లనిచ్చి బడి భవంతులపైకి ఎక్కి కోతికొమ్మచ్చిలు ఆడుతూ ప్రమాదాన్ని ఆహ్వానిస్తున్నారు. అలాంటి చిత్రాలే ఇవి. ప్రత్తిపాడు మండలం యనమదల ప్రాథమిక పాఠశాల భవనంపైకి ఎక్కి కొందరు చిన్నారులు ఇదిగో ఇలా ప్రమాదకరంగా విన్యాసాలు చేస్తూ, షెడ్లు ఎక్కుతూ, షెడ్లపై పరిగెడుతూ 'సాక్షి' కెమెరాకు కనిపించారు. పొరబాటున కాలు జారి కింద పడితే ప్రమాదం సంభవించే అవకాశం లేకపోలేదు. బడి వదిలిన తరువాత పిల్లలు నేరుగా ఇంటికి వస్తున్నారా? లేదా అని తల్లిదండ్రులు గమనించాలి. అదే విధంగా ఉపాధ్యాయులు కూడా బడి సమయం ముగిశాక విద్యార్థులు వెళ్లే వరకు వేచి చూస్తే కొంతమేరైనా ఇలాంటి ఘటనలు జరగకుండా ఉండే అవకాశం ఉంది. - ప్రత్తిపాడు

అంతర్జాతీయ కరాటే పోటీలలో ప్రతిభ చాటిన చిన్నారులు



గుంటూరు రూరల్: తమిళనాడులోని మద్రాసులో ఇటీవల జరిగిన ఇంటర్‌నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలలో మండలంలోని వెంగళాయపాలెం గ్రామానికి చెందిన చిన్నారులు గోల్డ్, సిల్వర్ మెడల్స్‌ను సాధించారు. గ్రామానికి చెందిన ఈపూరి ఉమాకార్తిక్ అంతర్జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్‌ను సాధించగా, ఈపూరి సహస్ర సిల్వర్ మెడల్‌ను సాధించారు. అంతర్జాతీయ స్థాయిలో మెడల్స్‌ను సాధించిన చిన్నారులను గ్రామ ప్రజలు అభినందించారు. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు తమ చిన్నారులు అంతర్జాయతీయ స్థాయిలో మెడల్స్ సాధిచటంతోపాటు గ్రామానికి పేరు ప్రఖ్యాతులు తెచ్చారని సంతోషం వ్యక్త పరిచారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో ప్రతిభ చాటాలి

ఎంఈవో సీహెచ్ రమాదేవి



స్వాతంత్య్ర సమరయోధుల వేషధారణలో ఉన్న చిన్నారులతో ఎంఈవో రమాదేవి

ప్రత్తిపాడు: విద్యార్థులు అన్ని రంగాల్లో ప్రతిభ చాటాలని, ఆ దిశగా పాఠశాల ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని మండల విద్యాశాఖాధికారి సీహెచ్ రమాదేవి అన్నారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా గురువారం పాఠశాలల్లో జరుగుతున్న సాంస్కృతిక కార్యక్రమాలను ఎంఈవో పరిశీలించారు. విద్యార్థులు స్వాతంత్య్ర సమరయోధుల వేషధారణలో జాతీయ జెండా చేతబట్టి ప్రత్యేక సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులకు అన్ని రంగాలపై ఆసక్తి కలిగించేలా శిక్షా సప్తాహ్ షెడ్యూల్‌ను రూపొందించారని చెప్పారు. అన్ని పాఠశాలల్లో నిర్ణీత షెడ్యూల్‌ను కచ్చితంగా అమలు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. ఆమె వెంట ఉపాధ్యాయులు, ఐఈఆర్పీ కోఆర్డినేటర్ తదితరులు ఉన్నారు.

జేసీని కలిసిన నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం



జేసీ భార్గవతేజను కలిసిన జిల్లా, నగర 4వ తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు

గుంటూరు రూరల్: జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పదవీ భాధ్యతలు స్వీకరించిన అమ్మిలినేని భార్గవతేజను జిల్లా నగర శాఖ నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు గురువారం జేసీ చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జేసీకి పుష్పగుచ్ఛాన్ని అందించి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా శాఖ అధ్యక్షుడు ఎస్.కొండయ్య, కార్యదర్శి కె.పవన్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షుడు జంగిలి రవికుమార్, కోశాధికారి ఆర్.వెంకాయమ్మ, సంయుక్త కార్యదర్శి కె.మస్తాన్‌రావు, నగర శాఖ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కార్యదర్శి కె.వీరాస్వామి, కోశాధికారి కె.మురళి, ఉపాధ్యక్షుడు ఆర్.సత్యనారాయణ కార్యవర్గ సభ్యులు తదితరులున్నారు.

గ్రామ సభకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

సాక్షి ఎఫెక్ట్

ప్రత్తిపాడు: గ్రామాల్లో జరుగుతున్న గ్రామ సభలకు ఎట్టకేలకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు హాజరయ్యారు. హర్ ఘర్ జల్, ఓడీఎఫ్ ప్లస్‌పై గ్రామాల్లో గత మూడు రోజులుగా గ్రామ సభలు జరుగుతుండటం, సభలకు అజెండా అంశమైన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పత్తా లేరంటూ ఈ నెల 24వ తేదీన 'సాక్షి'లో ప్రచురితమైన 'ఉత్తుత్తి సభలు.. ఊకదంపుడు ఉపన్యాసాలు' శీర్షికన కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం ప్రత్తిపాడు మండల పరిధిలోని పాతమల్లాయపాలెం, కొత్తమల్లాయపాలెం, మేడావారిపాలెం గ్రామాల్లో నిర్వహించిన గ్రామ సభలకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వినీల్ హాజరై హర్ ఘర్ జల్ పథకంపై ప్రజలకు వివరించారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు తాగునీటి పరీక్షలు నిర్వహించి స్వచ్ఛమైన జలాన్ని గ్రామంలోని అన్ని కుటుంబాలకు అందించడమే హర్ ఘర్ జల్ ప్రధాన ఉద్దేశమని చెప్పారు.

ప్రతి కుటుంబం మరుగుదొడ్డి వినియోగించాలి

మరుగుదొడ్లను నిర్మించుకున్నప్పటికీ కొందరు వాటిని వినియోగించడం లేదని, ప్రతి కుటుంబం టాయిలెట్లు వినియోగించాలని ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ షేక్ ఖాజా అన్నారు. పాతమల్లాయపాలెంలో ఉప సర్పంచ్ సిద్ధంశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన గ్రామ సభలో ఖాజా మాట్లాడుతూ మరుగుదొడ్లు లేని వారు పంచాయతీ కార్యదర్శులకు దరఖాస్తు చేసుకుంటే వెంటనే మంజూరు చేయడం జరుగుతుందన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ మండల రిసోర్స్ కోఆర్డినేటర్ డబ్బూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఓడీఎఫ్ ప్లస్ గ్రామాలలో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ ప్రక్రియ చేపట్టడం, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో కార్యదర్శి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పాతమల్లాయపాలెం గ్రామ సభలో మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వినీల్

మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు

గుంటూరు ఓఎస్‌ఎస్ న్యాయవాది ఎ.విజయలక్ష్మి

ప్రత్తిపాడు: మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయని గుంటూరు మహిళా ప్రాంగణం వన్ స్టాప్ సెంటర్ (ఓఎస్‌ఎస్) న్యాయవాది ఎ.విజయలక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం మహిళలకు పని ప్రదేశాల్లో, ఇంటా, బయటా ఎదురయ్యే లైంగిక వేధింపులపై ఎలా పోరాడాలి? చట్టాలు ఎలా రక్షణగా ఉన్నాయన్న అంశాలపై వాటర్ ఇండియా సహకారంతో అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీడీపీవో వి.సుజాత దేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఓఎస్‌డబ్ల్యూ న్యాయవాది విజయలక్ష్మి హాజరయి మాట్లాడుతూ లైంగిక వేధింపుల నుంచి మహిళలను రక్షించేందుకు 2013లో లైంగిక వేధింపుల చట్టం అమల్లోకి తీసుకువచ్చారని తెలిపారు. అత్యవసర సమయాల్లో మహిళలు 181 హెల్ప్‌లైన్ నంబరుకు ఫోన్ చేసి సాయం పొందవచ్చన్నారు. మహిళలకు ఎలాంటి సమస్యలున్నా నేరుగా ఓఎస్‌ఎస్ సెంటరును సంప్రదించవచ్చని వివరించారు. సీడీపీవో సుజాతదేవి మాట్లాడుతూ మహిళలు ఆత్మస్థైర్యంతో తమ విధులను నిర్వర్తించాలన్నారు. విధుల్లో ఎదురయ్యే ఆటుపోట్లను సమర్థవంతంగా ఎదుర్కోగలిగినపుడే ఉద్యోగం సంతృప్తినిస్తుందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ సీడీపీవో విజయనిర్మల, సూపర్‌వైజర్లు అరుణ, వెంకటరత్నం, ఇండియా డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీడీపీవో సుజాతదేవి, వేదికపై న్యాయవాది విజయలక్ష్మి, ఏసీడీపీవో విజయనిర్మల

నిషేధిత పురుగు మందులు విక్రయిస్తే కేసులు

మండల వ్యవసాయాధికారి అరుణకుమారి

ప్రత్తిపాడు: నిషేధిత పురుగు మందులు విక్రయిస్తే కేసులు నమోదు చేయడం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి కె.అరుణకుమారి అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో గురువారం ఉదయం ఏవో అరుణకుమారి పురుగుమందుల దుకాణాలు, ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాల్లో తనిఖీలు నిర్వహించారు. స్థానిక బస్టాండు ఎదురునున్న ఒక ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసులో నిషేధిత పురుగు మందులు మూడు బాక్సుల్లో ఉండటాన్ని గమనించారు. వాటిని పరిశీలించి అందులో ఉన్న 60 బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.49,800 ఉంటుందని ఏవో తెలిపారు. పార్శిల్ గుంటూరు నుంచి వలి డైలీ పార్శిల్ సర్వీసెస్ ద్వారా ప్రత్తిపాడు పార్శిల్ ఆఫీసుకు పి.శ్రీనివాస్ అనే వ్యక్తి పేరు మీద వచ్చినట్లు గుర్తించారు. ఈ మేరకు ప్రత్తిపాడు పోలీసులకు ఏవో ఫిర్యాదు చేశారు.



స్వాధీనం చేసుకున్న పురుగు మందులను పరిశీలిస్తున్న ఏవో అరుణకుమారి

విజ్ఞాన్ వర్సిటీ లైబ్రేరియన్ రజనీకుమారికి గ్రంథాలయ పురస్కారం

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ ప్రధాన గ్రంథాలయ అధికారిణి ఆచంట రజనీకుమారి గ్రంథాలయ పితామహుడు, పద్మశ్రీ అయ్యంకి వెంకటరమణయ్య, గ్రంథాలయ గాంధీ డాక్టర్ వెలగా వెంకటప్పయ్యల పేర్లతో ప్రతిష్టాత్మకంగా ఇచ్చే గ్రంథాలయ పురస్కారం అందుకున్నట్లు విజ్ఞాన్ వైస్ చాన్స్‌లర్ పీ నాగభూషణం గురువారం తెలిపారు. ఈ సందర్భంగా వీసీ నాగభూషణం మాట్లాడుతూ అన్నమయ్య సేవా సమితి ఆధ్వర్యంలో గుంటూరులోని బృందావన్ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ కేజీ శంకర్, డాక్టర్ ఆరేటి కృష్ణకుమారిల చేతుల మీదుగా గ్రంథాలయ పురస్కారంతో పాటు రూ.10 వేల నగదు బహుమతిని అందుకున్నట్లు తెలిపారు. ఆచంట రజనీకుమారి గత 28 సంవత్సరాలుగా లైబ్రేరియన్‌గా ఎంతో విలువైన సేవలు అందించారని, డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు చేయడంతో పాటు ఎప్పటికప్పుడు విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్స్, అధ్యాపకులకు అవసరమైన పుస్తకాలను, పరిశోధన పత్రాలను అందజేయడంలో చేసిన కృషికి గాను ఈ పురస్కారం లభించిందన్నారు. విజ్ఞాన్ వర్సిటీ లైబ్రరీలో 1,15,000 పుస్తకాలు, 2 లక్షల ఈ-బుక్స్ అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. ఏపీఎల్ఏ శాశ్వత సభ్యురాలిగా గుర్తింపు పొందటంతో పాటు అనేక విశ్వవిద్యాలయాల్లో జరిగిన జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని గ్రంథాలయ అభివృద్ధిపై అనేక పత్రాలను సమర్పించారని తెలియజేశారు. పురస్కారం అందుకున్న ఆచంట రజనీకుమారి మాట్లాడుతూ ఈ పురస్కారం నా మీద మరింత బాధ్యతను పెంచడంతో పాటు గ్రంథాలయాల అభివృద్ధికి మరింత కృషి చేస్తానని పేర్కొన్నారు. గ్రంథాలయ పురస్కారం అందుకున్న ఆచంట రజనీకుమారిని విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ లావు రత్తయ్య తదితరులు అభినందించారు. రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, లైబ్రరీ సిబ్బంది పాల్గొన్నారు.



లైబ్రేరియన్ రజనీకుమారిని అభినందిస్తున్న విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య

మాదక ద్రవ్యాల కట్టడికి విస్తృత ప్రచారం



సతీష్‌కుమార్, జిల్లా ఎస్పీ

నగరంపాలెం: జిల్లాలోని ప్రతి పోలీస్‌స్టేషన్(పీఎస్) పరిధిలో ఆటోల ద్వారా మాదక ద్రవ్యాలు, చెడు అలవాట్లపై విస్తృత ప్రచారం కల్పించాలని జిల్లా ఎస్పీ కె.సతీష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో పోలీస్ అధికారులను ఆదేశించారు. మత్తు, చెడు అలవాట్ల వలన తలెత్తే దుష్పరిణామాలపై యువతకు అవగాహన కల్పించాలని అన్నారు. జిల్లాలో నేరాల నియంత్రణ, పరిశోధనలో సీసీ కెమెరాలు అత్యంత కీలకమని పేర్కొన్నారు. కెమెరాలను ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేయడం వల్ల 24 గంటలు నిఘా ఉంటుందని, ప్రతి పీఎస్ పరిధిలో కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడు వాటి పనితీరును పరిశీలన చేయాలన్నారు. కెమెరాల ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎస్పీ ఆదేశించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ప్రత్తిపాడు డివిజన్
90109 57733 (ప్రత్తిపాడు)
90109 62225 (పొన్నూరు)
Office mail : sakshigntadvt@gmail.com